క్లుప్తంగా

పెద్దిరెడ్డిని కలసిన కలిమిలి



వెంకటగిరి రూరల్: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్ సీపీ ఎస్ఈసీ (స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సభ్యులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు రాజకీయ అంశాలు, పార్టీ పరిస్థితిపై చర్చించారు.

వైభవంగా అమ్మవారి కొలుపు



హారతి ఇస్తున్న భక్తులు

సైదాపురం: మండలంలోని తోకలపూడి గ్రామంలో గ్రామ శక్తి స్వరూపులైన యామాలమ్మ, గంగమ్మ కొలుపు వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. చివరిరోజైన ఆదివారం బంధుమిత్రులతో గ్రామంలో పండుగ వాతావరణం అలుముకుంది. భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పొంగళ్లు పెట్టి తమ మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామ, మండల వైఎస్సార్‌సీపీ నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు.

పేరంటాళమ్మ భక్తులకు అన్నదానం



అన్నదానంలో భోజనం చేస్తున్న పేదలు

చిల్లకూరు : దేవీ నవరాత్రి ఉత్సవాల అనంతరం వచ్చే ఆదివారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి పేదలకు అన్న దానం చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో వెలిసిన నారాయణ పేరంటాళమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దసరా ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన లక్కీడిప్ విజేతలకు బహుమతులుగా వెండి కాయిన్ అందించారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ



సరుకులను అందజేస్తున్న ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి ప్రతినిధులు

గూడూరురూరల్ : మండలంలోని గూడూరు పట్టణంలో ఉన్న శ్రీకల్యాణ వీరభద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. దీనికి జయజ్యోతి దాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి.మాధురి, కార్యదర్శి ఎస్.లక్ష్మి, జీవని, రెడ్ సంస్థ అధ్యక్షుడు సుధీర్ పాల్గొన్నారు.

గురుకుల అధ్యాపకునికి ఘన సన్మానం



డాక్టర్ చెన్నకేశవులను సన్మానిస్తున్న దృశ్యం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ చెన్నకేశవులను వీఎస్ఆర్ ఫౌండేషన్ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. వీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మేరియు రోజా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభగల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు నిర్వహించిన సర్వేలో స్థానిక బోటనీ అధ్యాపకులు డాక్టర్ ఎం చెన్నకేశవులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన్ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, మాజీ శాసన మండలి సభ్యులు లక్ష్మణరావు, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ కృష్ణమోహన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గురుకుల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు మధుసూదన్‌రావు ఘనంగా సన్మానించారు.

వన్య ప్రాణులను కాపాడుదాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం : అడవులతోపాటు వన్యప్రాణులను మనమంతా కాపాడుకోవాలని సైదాపురం బీట్ అధికారి రవిశేఖర్ కోరారు. సైదాపురం అటవీశాఖ పరిధిలోని ఆదివారం వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడవులు కాపాడుకుని అటవీ జంతువుల సంరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. చెట్లను నరక్కుండా మొక్కలు విరివిగా పెంచాలని కోరారు.

రోడ్ల సొగసు చూడతరమా?



బురదగుంటలతో నిండిన కప్పగుంటకండ్రిగ రోడ్డు



అధ్వాన్నంగా యడపూడి రోడ్డు



రొచ్చురొచ్చుగా మారిన జూమానుగుంట రోడ్డు

చినుకు పడితే గ్రామీణ రోడ్లన్నీ రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. అసలే మట్టి రోడ్లు, గుంతలతో నిండి ఉండడంతో చినుకుపడితే చిత్తడవుతున్నాయి. ఈ గ్రామీణ రోడ్లును అభివృద్ధి చేయండి మహాప్రభో అంటూ ప్రజలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే దిక్కులేదు. నిన్న మొన్న కురిసిన తేలికపాటి వర్షానికి కప్పగుంటకండ్రిగ, దిరసనమాల, యడపూడి, పొలచ్చూరు, కిష్టప్పకండ్రిగ, జూమానుగుంట, గంగరాజుకండ్రిగ, యాలకారికండ్రిగ గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లన్నీ లోతైన గోతులు ఏర్పడి వర్షపునీరు చేరడంతో బురదగుంటలుగా మారాయి. ప్రయాణించడానికి ఏమాత్రం వీలుకాకుండా తయారయ్యాయి. సుమారు 28కిలో మీటర్లు మేర ఉండే గ్రామీణ ప్రాంత రోడ్లన్నీ ఇలా అధ్వాన్నంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కూటమి పాలనలో రోడ్లు అభివృద్ధి కోసం ఒక్క పైసా వెచ్చించకపోవడంతో పల్లె జనులు అవస్థల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నేతలు స్పందించి గ్రావెల్‌రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - పెళ్లకూరు

వేమారెడ్డిని కలసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



కుమారస్వామిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిల్లకూరు: మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వేమారెడ్డి కుమార్ స్వామిరెడ్డిని రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎంపిక చేయడంతో చిల్లకూరు నాయకులు ఆదివారం ఆయన్ను కలిసి సత్కరించారు. మండలంలో పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేధావుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షులు నందవరం సుబ్బారావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రాపూరు: మండలంలోని తూమాయి సమీపంలోని పొలాల్లో ఆదివారం పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ వెంకట్ రాజేష్ తెలిపారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

సైదాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు, మండలానికి చెందిన పి విజయ్‌కుమార్ ఊటుకూరు సమీపంలో దాబా పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం సైదాపురం నుంచి చికెన్ తీసుకుని దాబాకు వెళుతుండగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు మరో బైక్ అకస్మాత్తుగా రావడంతో రెండు బైక్‌లు ఢీకొనడంతో విజయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

గూడూరుకు రూ.73 కోట్ల నిధులు విడుదల

చిల్లకూరు: అమృత్ స్కీంలో భాగంగా గూడూరు మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి తాగునీటిని నిరంతరాయంగా సరఫరా చేసేందుకు రూ.73 కోట్ల నిదులు మంజూరు చేస్తున్నట్లు మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ తెలిపారు. గూడూరు మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి మున్సిపాలిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అమృత్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా రూ.10 వేల కోట్ల నిధులను వెచ్చించి పనులు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన, మూడు నియోజకవర్గాల ప్రజాప్రతినిదులు, సునీల్‌కుమార్, విజయశ్రీ, రామక్రిష్ణ, మున్సిపాల్ కమినర్‌లు పాల్గొన్నారు.

కండలేరులో 58.460 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 58.460 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 430, పిన్నేరుకాలువకు 140, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటిబ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు 06-10-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	138
లేయర్ లైవ్	:	117
బ్రాయిలర్ చికెన్	:	246
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	270
లేయర్ చికెన్	:	200

మీ భద్రత మీ చేతుల్లోనే..



గూడూరు డీఎస్పీ గీతా కుమారి

గూడూరురూరల్ : మీ భద్రత మీ చేతుల్లోనే ఉందని, బంగారు ఆభరణాలు దోచుకెళ్లే ముఠా సంచరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు డీఎస్పీ గీతా కుమారి తెలిపారు. ఎక్కడైనా అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. విలువైన ఆభరణాలను మహిళలు ధరించి బయటకు వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమానాస్పదంగా వెంట నడిచే వ్యక్తులు, ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా ఉన్న వారిని గమనించి తక్షణమే జాగ్రత్త తీసుకోవాలన్నారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

మంత్రి గారూ.. మా సమస్యలు పరిష్కరించండి



మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

గూడూరురూరల్ : మంత్రి గారూ.. మా న్యాయమైన సమస్యలను పరిష్కరించండి అంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం గూడూరుకు వచ్చిన మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణను ఏపీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, మున్సిపల్ కార్మికులు కలసి వినతిపత్రం అందించారు. 12వ పీఆర్‌సీ కమిటీ నియామకం, మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి పని కల్పించాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, సమ్మె కాలపు జీతం చెల్లించాలని కోరారు. ఈ విషయంపై సీఎం దృష్టికి తీసుకెళతానని మంత్రి నారాయణ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దారా కోటేశ్వరరావు, గూడూరు పట్టణ కార్యదర్శి భూలోక మురళి, ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, వెంకటరమణ, బాలాజి, గిరి వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరణ బ్రాహ్మణ భవన్ ప్రారంభం



డాక్టర్ జనార్దన్‌రెడ్డిని సత్కరిస్తున్న శిరోమణి శర్మ, అధ్యక్షుడు శివకుమార్

గూడూరు రూరల్ : దాతల సహకారంతో రెండో పట్టణ పరిధిలోని వీరారెడ్డిపల్లి రోడ్డు సమీపంలో బ్రాహ్మణ భవన్, కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు శాఖ అధ్యక్షులు ఆనిమెళ్లి శివకుమార్ తెలిపారు. సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ మండపం ఆధునీకరణ పనులను పూర్తి చేసి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ భవన్, కల్యాణ మండపం నిర్మాణానికి డాక్టర్ జనార్దన్‌రెడ్డి, రోహిణి దంపతులు రూ.8 లక్షలు విరాళం అందించారని కొనియాడారు. ఈ మేరకు దాతలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఆటో డ్రైవర్లనూ ముంచేసిన కూటమి సర్కార్

తడ: ఆటో డ్రైవర్లనూ కూటమి నేతలు మోసం చేశారని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు బీ జయకుమార్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు సాధికారిత సంస్థ ఏర్పాటు, రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా, విద్యారుణాలు, చలానాల రద్దు వంటి హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. లోకేష్ పాదయాత్ర సమయంలో 13 లక్షల మంది ఆటోడ్రైవర్లు అర్హులుగా ఉన్నారని స్వయంగా చెబితే, ప్రస్తుతం కేవలం 2.9లక్షల మందికే పథకం వర్తింప చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



వైఎస్సార్ విగ్రహం వద్ద డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిట్టమూరు: కూటమి ప్రభుత్వ కుట్రలతో అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కొత్తగుంట గ్రామంలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ఎవరైతే అన్యాయంగా నష్టపోతున్నారో, తప్పుడు కేసులకు బలవుతున్నారో అలాంటి నాయకులకు, కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్‌ను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని, అరాచకాలను డిజిటల్ కోడ్ ద్వారా లాగిన్ అయ్యి డిజిటల్ బుక్‌లో తమ ఫిర్యాదులను అప్‌లోడ్ చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఈ డిజిటల్ బుక్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కామిరెడ్డి కస్తూర్ రెడ్డి, గొట్టికాటి రవిరెడ్డి, వైస్ ఎంపీపీ టీవీ రమణయ్య, చిల్లకూరు కోదండరామిరెడ్డి, కామిరెడ్డి రమేష్ రెడ్డి, దువ్వూరు లోకేష్ రెడ్డి, అనిల్ రెడ్డి, జగదీష్ రెడ్డి, వైసీ పుట్టబాబు, తేరువాయి మణి, చింతలమూడి మనోహర్, గిరిరెడ్డి, షేక్ మస్తాన్, సంచి మల్లికార్జున, ఆశ మధు, సంక్రాంతి కస్తూరయ్య, గంగాల రమణయ్య, మా బాషా, అట్ల సురేష్, నరేష్, అద్దెపూడి రమేష్, ఆశ శ్రీనివాసులు, తిరునామల్లి కుమార్ పాల్గొన్నారు.

పని గంటలను పెంచడం దుర్మార్గం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సైదాపురం: కార్మిక హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం పని గంటలను 8 నుంచి 10కి పెంచడం దుర్మార్గమైన చర్య అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్, పి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంఎస్ కాలనీలో ఆదివారం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా కార్మిక వర్గానికి ఇచ్చిన ఏఒక్క హామీ అమలు చేయలేదన్నారు. అనంతరం మండల కన్వీనర్‌గా భవాని, కో-కన్వీనర్‌గా సంక్రాంతి, ట్రెజరర్‌గా లక్ష్మీ ప్రసన్న, కమిటీ సభ్యులుగా జయసుధ, సుజాతమ్మ, హరిత, శ్రీనివాస్, రత్నగిరి, మస్తాన్, మమత, ప్రమీల, సుజాతమ్మను ఎన్నుకున్నారు. అనంతరం సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కర్రపత్రాలను ఆవిష్కరించారు.

ఎస్ఈసీ సభ్యుడిగా దబ్బల శ్రీమంత్‌రెడ్డి



సూళ్లూరుపేట : వైఎస్సార్‌సీపీ స్టేట్ కౌన్సిల్ (ఎస్ఈసీ) ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న దబ్బల శ్రీమంత్‌రెడ్డి నియమతులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కమిటీ శ్రీమంత్‌రెడ్డిని ఎంపిక చేశారు.

మట్టి మాఫియా పంజా



- అడ్డూ అదుపూ లేని అక్రమ రవాణా
- చీకట్లోనూ ఆగని స్మగ్లింగ్

రాత్రి సమయంలో వడ్డికండ్రిగ గ్రామ ప్రాంతంలో అక్రమంగా గ్రావెల్ లోడింగ్

దొరవారిసత్రం : చీకటిపడితే చాలు మట్టి టిప్పర్లు రోడ్డెక్కుతాయి. భారీ స్థాయిలో మట్టిని అక్రమంగా తరలించేస్తాయి. స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి అండదండలు పుష్కలంగా ఉండడంతో గ్రావెల్ మాఫియాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో విలువైన గ్రావెల్‌పై నియోజకవర్గ స్థాయికి చెందిన రెండు వర్గాల కూటమి నేతల కన్నుపడడంతో వారు ఇష్టారాజ్యంగా తరలించేస్తున్నారు. యంత్రాలు పెట్టి తవ్వించి భారీ టిప్పర్లతో సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట ప్రాంతాల్లోని లేఅవుట్లతో పాటు వివిధ పరిశ్రమలకు తరలించి లక్షలు గడిస్తున్నారు. గ్రావెల్ అక్రమ రవాణాతో పూలతోట, నెలబల్లి తదిర గ్రామాల్లోని ప్రభుత్వ భూములు ఇప్పటికే గోతుల మయంగా మారాయి. గత కొన్ని రోజుల నుంచి రాత్రి అయితే దొరవారిసత్రం మండలం వడ్డికండ్రిగ, పాళెంపాడు, వేణుంబాకం గ్రామాల పరిధిలోని ప్రభుత్వ, చెరువు భూముల్లో యంత్రాలు పెట్టి రాత్రికి రాత్రే పదుల సంఖ్యలో టిప్పర్లతో సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమలకు, లేఅవుట్లకు తరలిస్తున్నారు. పూలతోటమిట్ట, వడ్డికండ్రిగ, పాళెంపాడు, వేణుంబాకం తదితర గ్రామాల నుంచి డీవీ సత్రం మీదుగానే ఈ మట్టి తరలింపు కొనసాగుతోంది. దీంతో మండలంలోని ఈ టిప్పర్లు వెళ్లే రోడ్లు కుంగిపోయి గోతుల మయంగా మారాయి.







డీవీ సత్రం మీదుగా మట్టితో వెళుతున్న టిప్పర్, చెరువును తలపిస్తున్న ప్రభుత్వ భూమి, పాళెంపాడు వద్ద ప్రభుత్వ భూమిలో గ్రావెల్ అక్రమలోడింగ్

ఉద్యోగుల బకాయిలపై ఉద్యమం



మాట్లాడుతున్న ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు

గూడూరురూరల్ : ఉద్యోగుల బకాయిల చెల్లింపులోనూ కూటమి ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమబాట తప్పదని ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం తిరుపతి జిల్లాకు చెందిన గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, వాకాడు డిపోల ఏపీపీటీడీ(ఆర్టీసి) ఎంప్లాయీస్ యూనియన్ సంయుక్త జనరల్ బాడీ సమావేశం వై.వి.నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన దామోదరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన ఐఆర్ ప్రకటించడం, 12వ పీఆర్‌సీ కమిషన్ నియామకం వంటి అంశాలపై ఇప్పటి వరకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పడ్డాక ఇవ్వాల్సిన నాలుగు డీఏలు కూడా ఇంత వరకు ప్రకటించలేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఇ.హెచ్.ఎస్) ద్వారా సరైన వైద్యసౌకర్యాలు అందడంలేదని, ఆర్టీసీ ద్వారానే పాత పద్ధతిలో రిఫరల్ ఆస్పత్రుల ద్వారా వైద్య సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇ.యు.స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.నారాయణరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ మురుగమ్మ, జోనల్ నాయకులు విజయ్‌కుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షులు జి.ఆర్.చంద్ర,జిల్లా కార్యదర్శి మస్తాన్, నాయకులు సుబ్బారావు, కె.సి.రాజు, వెంకటేషులు, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఉమెన్ వింగ్ ప్రధాన కార్యదర్శి పి.పద్మజ, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, వాకాడు డిపో అధ్యక్ష, కార్యదర్శులు వై.వి.నారాయణ, ఎస్.కె.జిలాని, డి.రాజగోపాల్, వై.వి.ప్రసాద్, సీనయ్య, జయరాజ్, శ్రీనివాసులు, యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.